

అధిక లోడు లారీకి రూ.20 వేలు జరిమానా

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బండరాళ్లతో జాతీయ రహదారిపై వెళుతున్న లారీని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకొని జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలి పారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళుతున్న బండరాళ్ల లోడు క్వారీ లారీకి రూ.20 వేల 35 రూపాయలు జరిమానా విధించినట్టు ఆయన పేర్కొన్నారు. మాకవరం నుంచి రాంబిల్లికి ఈ లోడు వెళుతున్నదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మరో రెవెన్యూ డివిజన్

నక్కపల్లి కేంద్రంగా ఏర్పాటు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం

- ఇప్పటికే ఉన్న అనకాపల్లి, నర్సీపట్నంతో పాటు మరో డివిజన్
- ప్రస్తుతం నర్సీపట్నం డివిజన్‌లో ఉన్న మాడుగుల, చీడికాడ మండలాలు అనకాపల్లి పరిధిలోకి..
- పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు మరింత మెరుగైన సేవల కోసం ఏర్పాటు





నక్కపల్లి వ్యూ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లా సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాకు మరో రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్రంలో కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడు ఆమోద ముద్ర వేశారు. దీంతో జిల్లాలో ఇప్పటికే ఉన్న అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లతో పాటు నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌గా మారనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ కావడంతో కొత్త డివిజన్ ఏర్పాటుపై అధికారులు కసరత్తు మొదలు పెట్టారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో కొత్తగా మరొక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఆలోచన చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలోని మండలాలతో నక్కపల్లి కేంద్రంగా కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రివర్గం ప్రతిపాదనలకు కదలిక వచ్చింది. ఇప్పటికే జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లు ఉండగా తీర ప్రాంత ప్రజల సౌకర్యార్థం, నక్కపల్లి కేంద్రంగా పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నక్కపల్లి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయనుంది. కొత్తగా ఏర్పాటు కానున్న నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలు, ఎలమంచిలి నియోజకవర్గం పరిధిలోని ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాలు కలవనున్నాయి. ప్రస్తుతం నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలు, అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాలు నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలవనున్నాయి. కాగా నర్సీపట్నం డివిజన్‌లో ఉన్న మాడుగుల, చీడికాడ మండలాలు అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోకి రానున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తీర ప్రాంత మండలాలైన నక్కపల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో పారిశ్రామికంగా అభివృద్ధి పరుగులు పెడుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లు సముద్ర తీర ప్రాంతానికి దూరంగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వ సేవల ... మిగతా 6వ పేజీలో

కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై చర్యలు



జిల్లాలో నక్కపల్లి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. కొత్త డివిజన్‌లో ఏ మండలాలు ఉంటాయనే దానిపై ఇంకా వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఏయే మండలాల్లో ఎంతమంది జనాభా ఉన్నారు, విస్తీర్ణం వంటి వివరాలు పంపించాం. అందరి ఆమోదంతో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నక్కపల్లి కేంద్రంగా త్వరలో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరగనుంది. **- విజయకృష్ణన్, కలెక్టర్**

విద్యాలయాల్లో

తాగునీటి పరీక్షలు తప్పనిసరి

15 రోజులకోసారి పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలి

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అన్ని సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటిని 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం మిషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి వనరుల వద్ద మురుగు చేరకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా తాగునీటి పరీక్షలు, ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ జరగాలన్నారు. బహిరంగ మలవిసర్జన జరగకుండా చర్యలు చేపట్టాలని, కాచిన నీటిని తాగడం, ఆహారం తినే ముందు, మల విసర్జన తరువాత శుభ్రంగా చేతులు కడుక్కోవడంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. భూగర్భ జలాలను పెంచడానికి కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మాణం, చెరువు గట్లు పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలోని 1,539 గ్రామాల్లో నూరుశాతం గృహాలకు కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి 'హర్ ఘర్ జల్' గ్రామాలుగా చేయడానికి కృషి చేయాలని అధికారులను ... మిగతా 6వ పేజీలో

ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు

జిల్లాలోని 65 రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాట్లు

- 35 వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం



ఎలమంచిలి మునిసిపాలిటీలోని తెరువుపల్లిలో గల రైతు సేవా కేంద్రం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని 65 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బందిని నియమించి వారికి నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు.

జిల్లాలో 54,465 హెక్టార్లలో వరి సాగు చేయగా, 40 వేల మెట్రిక్ టన్నులకు పైగా వరి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. కాగా జిల్లాలో ఇప్పుడిప్పుడే రైతులు వరి కోతలు ప్రారంభించారు. మరికొద్ది రోజుల్లో కోతలు మరింత వేగం పుంజుకోనున్నాయి. ఈ క్రమంలో ధాన్యానికి మద్దతు ధర కల్పించడమే కాకుండా ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి అక్రమాలు చోటుచేసుకోకుండా రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో 24 మండలాలు ఉండగా 65 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. జేసీ జాహ్నవి ఆధ్వర్యంలో ఇప్పటికే జిల్లాలో పౌర సరఫరాల సంస్థ అధికారులు 24 రైస్ మిల్లర్ల యాజమానులతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష జరిపారు. మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం తేమశాతం కొనుగోలు యంత్రాలను అందుబాటులో ఉంచారు. ధాన్యం కొనుగోలు సమయంలో గోనె సంచుల కొరత సమస్య రాకుండా ముందుగా 9 లక్షల సంచులను అందుబాటులో ఉంచుకోవాలని మిల్లర్లకు సూచించారు. గత ఏడాది 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈసారి 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బందిని నియమించి వారికి నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమాలను పౌర సరఫరాల సంస్థ డీఎం జయంతి పర్యవేక్షించారు. ప్రభుత్వం ఈ ఏడాది గ్రేడ్ ఏ రకం 100 కిలోల ధాన్యానికి రూ.2,389, సాధారణ రకానికి (కామన్) రూ.2,369 మద్దతు ధర ప్రకటించింది. జిల్లాలో ఇప్పటికే మాడుగుల నియోజకవర్గంలోని దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు మండలాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఆయా మండలాల్లో డిసెంబరు మొదటి వారంలో ముందుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

మిగిలిన మండలాల్లోనూ స్థానిక రైతుల అవసరాల మేరకు కేంద్రాలను ప్రారంభించనున్నారు. రైతు సేవా కేంద్రాల వద్దకు తెచ్చిన ధాన్యం తడిచిపోకుండా 600 టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది రైతుల నుంచి ప్రతి గింజ సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పౌర సరఫరాల శాఖ డీఎం జయంతి తెలిపారు.

అవినీతి అధికారులపై కొరడా

ఏసీబీ కేసులో పట్టుబడిన తహశీల్దార్, డీటీలపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం ఆదేశం



స్థానిక తహశీల్దార్ కార్యాలయం

చోడవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో భూవివరాలు నమోదు చేసేందుకు రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ నాలుగేళ్ల క్రితం ఏసీబీ అధికారులకు పట్టుబడిన కేసులో అప్పటి తహశీల్దార్ బి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజాపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021 జూలై 1న స్థానిక వ్యాపారి బుచ్చిబాబు తన పొలం ఆన్‌లైన్ చేయాలని అప్పటి తహశీల్దార్ బి.రవికుమార్, డీటీ రాజాలను ఆశ్రయించారు. ఆ భూమిని ఆన్‌లైన్ చేసేందుకు తహశీల్దార్, డీటీలు రూ.20 లక్షలకు పైగా లంచం డిమాండ్ చేయడంతో చివరకు రూ.5 లక్షలకు ఒప్పందం కుదిరింది. రెవెన్యూ అధికారుల తీరుతో విసిగిపోయిన బుచ్చిబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుచ్చిబాబు నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు మాటు వేసి తహశీల్దార్ రవికుమార్, డీటీ రాజాలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో అరెస్టయిన ఈ ఇద్దరూ సస్పెన్షన్‌కు గురయ్యారు. ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో విధుల్లో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో వీరిపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం విశేషం.

ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణతకు సంకల్పం

జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో 50 రోజుల ప్రణాళిక

ఏబీసీ కేటగిరీలుగా విద్యార్థుల విభజన

- కళాశాల వసతి గృహాలకు వెళ్లి చదివించాలని అధ్యాపకులకు ఆదేశాలు
- ఈ ఏడాది మెరుగైన ఫలితాల సాధనకు కలెక్టర్ కృషి



నర్సీపట్నం శివపురంలోని ఎస్టీ కళాశాల హాస్టల్-2లో మంగళవారం రాత్రి స్టడీ అవర్స్‌లో ఇంటర్ విద్యార్థులను చదివిస్తున్న అధ్యాపకుడు శర్మ

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో సంకల్ప్- 2026 పేరుతో 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోంది. ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు దీనిని అమలు చేస్తారు. నిర్దేశించిన కాల పట్టిక ప్రకారం అధ్యాపకులు ఉదయం పాఠాలు చెప్పడం, మధ్యాహ్నం తర్వాత విద్యార్థులను చదివించడం, చదివిన పాఠ్యాంశాల మీద పరీక్షలు రాయించడం విధిగా చేయాలి. జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి పర్యవేక్షణ చేయాలి. కళాశాలల వారీగా విద్యార్థుల ప్రమాణాల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 20 ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 13,589 మంది ఉండగా, ఫీజులు చెల్లించిన వారు 13,148 మంది ఉన్నారు. అలాగే ఫీజులు చెల్లించిన ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులు 12,272 మంది, ప్రైవేటు విద్యార్థులు 853 మొత్తం 13,125 మంది ఉన్నారు. తొలుత అర్ధ సంవత్సరం పరీక్షలు ఆధారంగా ఏబీసీ కేటగిరీగా విద్యార్థులను బృందాలుగా వర్గీకరిస్తారు. తర్వాత ప్రి ఫైనల్స్, ఫైనల్స్ పరీక్షలు ఆధారంగా ఏబీసీ కేటగిరీలుగా విభజించి చదివిస్తారు. ఫిబ్రవరి 23 నుంచి జరగబోయే వార్షిక ఇంటర్ పరీక్షలకు సిద్ధం చేస్తారు.

యూనిట్ పరీక్షల్లో ప్రగతి ఇలా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో యూనిట్ పరీక్షల ఆధారంగా జిల్లాలో మొదటి సంవత్సరంలో ఏ కేటగిరీ విద్యార్థులు 607, బీ కేటగిరీ 581, సీ కేటగిరీ 766, డీ కేటగిరీ 983 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఏ కేటగిరీ విద్యార్థులు 688, బీ కేటగిరీ 572, సీ కేటగిరీ 501, డీ కేటగిరీ 639 మంది ఉన్నారు.

జిల్లాలో మెరుగైన ఫలితాల కోసం...

2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఉత్తీర్ణత కేవలం 42 శాతం మాత్రమే ఉంది. వృత్తి విద్యా కోర్సులో 59 శాతం ... మిగతా 6వ పేజీలో

పెన్సిల్ ముల్లుపై అయ్యప్ప స్వామి



పెన్సిల్ ముల్లుపై అయ్యప్ప స్వామిని చెక్కిన దృశ్యం

నక్కపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేశ్ పెన్సిల్ ముల్లుపై అయ్యప్ప స్వామి రూపాన్ని అద్భుతంగా చెక్కారు. వెంకటేశ్ ఇప్పటి వరకు ఎన్నో అద్భుతమైన సూక్ష్మ కళాఖండాలను తయారు చేసి గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించిన విషయం తెలిసిందే. కాగా ఇప్పుడు పెన్సిల్ ముల్లుపై అయ్యప్ప స్వామి రూపాన్ని చెక్కి అందరి ప్రశంసలు పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చార్కోల్ పెన్సిల్ ముల్లుపై 16 మిల్లీమీటర్ల పొడవు, 8 మిల్లీమీటర్ల వెడల్పున అయ్యప్ప స్వామిని తయారుచేసేందుకు 6 గంటల సమయం పట్టిందని తెలిపారు.

దాబాలా.. బార్‌లా?

నిబంధనలకు విరుద్ధంగా దాబాల్లో ఏరులై పారుతున్న మద్యం

- బహిరంగ ప్రదేశాల్లోనూ సేవిస్తున్న మందుబాబులు
- పట్టించుకోని పోలీసులు

ఎస్.రాయవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దాబాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం ఏరులై పారుతోంది. నిబంధనల ప్రకారం దాబాల్లో మద్యం అనుమతించడం, సేవించడం, అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడమనేది నిషేధం. కానీ మండలంలో మాత్రం యథేచ్ఛగా ఇది సాగుతోంది.**

మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దాబాల నిర్వాహకులు పోలీసు హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారు. దాబాల్లో మద్యం సరఫరా చేస్తూ బార్‌ల్లా మార్చేశారు. ఆహార పదార్థాల కోసం వచ్చే మహిళలు, బాలలు ఇక్కడి పరిస్థితిని చూసి ఆందోళన చెందుతున్నారు. అలాగే కొందరు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ హడావిడి చేస్తున్నారు. ఖాళీ సీసాలను అక్కడే వదిలేసి వెళ్లిపోతుండడంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. నిత్యం పర్యాటకులతో కిటకిటలాడే రేవుపోలవరం సముద్రతీరం సమీపంలో ఉన్న బహిరంగ ప్రదేశాల్లో కూడా మందుబాబులు పెద్దఎత్తున మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారు. అయితే వీరిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దాబాల్లో మద్యం అమ్మకాలను కట్టడి చేయాలని, అలాగే బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రేవుపోలవరం సముద్రతీరం సమీపంలోని బహిరంగ ప్రదేశంలో ఖాళీ మద్యం సీసాలు



మద్యం మత్తులో ఓ వ్యక్తి (ఫైల్)



అడ్డరోడ్డులోని ఓ దాబాలో గ్లాసుల్లో మద్యం పోసుకుంటున్న యువకులు

విజయశ్రీ బ్లడ్ సెంటర్ మూసివేత

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తుండడంతో ఉన్నతాధికారుల చర్యలు

- ఔషధ నియంత్రణ, పరిపాలన విభాగం తనిఖీల్లో లొసుగులు బహిర్గతం
- అర్హులైన సిబ్బంది లేకపోవడంతోపాటు రక్తాన్ని శుద్ధి చేయడంలో తగిన ప్రమాణాలు పాటించడం లేదని గుర్తింపు

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విజయశ్రీ బ్లడ్ సెంటర్‌పై ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం అధికారులు కొరడా ఝుళిపించారు. రక్తాన్ని శుద్ధి చేయడంలో ప్రమాణాలు పాటించకపోవడం, అర్హులైన సిబ్బంది లేకపోవడం, అనుమతి లేకుండా పరికరాలను మరోచోటకు తరలించడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణిస్తూ సెంటర్‌ను మూసివేయించాల్సిందిగా రాష్ట్ర ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం డైరెక్టర్ ఆదేశాలు జారీచేశారు.



విజయశ్రీ బ్లడ్ సెంటర్ వద్ద అధికారులు

దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ ... మిగతా 6వ పేజీలో

'చెకుముకి' విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓలు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్థానిక ఎంఈఓలు సీఆర్‌కే దేవరాయల్, బి.రజనీ అభినందించారు. ఈ నెల 23న జరిగిన జిల్లా స్థాయిలో జరిగిన చెకుముకి పోటీల లో వీరు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. మంగళవారం ఆ విద్యార్థులను తమ కార్యాలయంలో ఎంఈవోలు అభినందించారు. వీరంతా డిసెంబరు 21 నుంచి 23వ తేదీ వరకూ కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు మారిశెట్టి వెంకట అప్పారావు, ఉప్పాడ రాము, బొడ్డేడ రామ్‌కుమార్, ఉపాధ్యాయులు ధర్మిరెడ్డి రాజు, సలీం పాల్గొన్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు'



ట్రాక్టర్ డ్రైవర్‌తో సంతకం చేయిస్తున్న వైసీపీ నాయకులు

మునగపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దంటూ సంతకాలను సేకరిస్తున్నామని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం మునగపాక ఎస్‌బీఐకు సమీపంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, నాయకులు షేక్ ఇస్మాయిల్, బొద్దపు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు ఇవ్వాలి

ఎస్.రాయవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్త ద్వారా వర్మీ కంపోస్టును తయారు చేసి స్థానిక రైతులకు అందించాలని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. తిమ్మాపురం, పెదగుమ్ములూరు, కొరుప్రోలు గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లాప్ మిత్రులు ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. సేకరించిన చెత్తను వర్మీ కంపోస్టుగా తయారుచేసి రైతులకు అందించాలన్నారు. కొరుప్రోలులో ఉన్న సంపద తయారీ కేంద్రాన్ని డిప్యూటీ ఎంపీడీవో పరిశీలించి, స్థానిక కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రామలక్ష్మి, నాగప్రభు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడిగా నెలపర్తి



పాయకరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడిగా పాయకరావుపేటకు చెందిన నెలపర్తి నాగేశ్వరరావు నియమితులయ్యారు. పట్టణంలోని ఇందిరాకాలనీకి చెందిన నెలపర్తి నాగేశ్వరరావు పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన రాష్ట్ర హోం మంత్రి అనిత పార్టీ నియోజకవర్గ క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా నెలపర్తి నాగేశ్వరరావుకి రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరి, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పార్టీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై వైసీపీ దుష్ప్రచారం

- గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న భీమరశెట్టి శ్రీనివాసరావు

మునగపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పాలనపై వైసీపీ శ్రేణులు చేస్తున్న దుష్ప్రచారం రోజురోజుకు పెచ్చుమీరుతున్నదని ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం పెద్ద ఎత్తున అమలు చేస్తున్నా వైసీపీ విషం చిమ్ముతోందన్నారు. పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులను సైతం భ్రమలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతన్న కోసం ప్రభుత్వం చేపట్టనున్న కార్యక్రమాలు విస్తృత ప్రచారం జరగాల్సి ఉందని, పార్టీ శ్రేణులంతా ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు విల్లూరి నూక నర్సింగరావు, దాడి శివ, సబ్బి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

షాపులోకి దూసుకెళ్లిన కారు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండల కార్యాలయం సమీపంలో మంగళవారం కారు షాపులోకి దూసుకుపోయింది. పూడిమడక కంపెనీల వైపు నుంచి అచ్యుతాపురం జంక్షన్ వస్తున్న కారు మలుపు తిరగాల్సిన సమయంలో సెల్‌ఫోన్‌లో చూస్తూ ఎదురుగా వస్తున్న తొట్టి ఆటోను ఢీకొట్టాడు. అనంతరం అదుపు తప్పి పక్కనే ఉన్న టిఫిన్ షాపులోకి దూసుకెళ్లింది. వెంటనే కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. షాపు గోడను బలంగా ఢీకొట్టడంతో గోడ కారు మీద పడి పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు తగలకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిరింది.

అలరించిన మునగపాక కళాకారుల కోలాటం



పద్మావతి అమ్మవారి సన్నిధిలో కోలాట ప్రదర్శన ఇచ్చిన మునగపాక కళాకారులు

మునగపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరుగుతున్న పద్మావతి బ్రహ్మోత్సవాల్లో మునగపాక కోలాట కళాకారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆహ్వానం మేరకు మునగపాక గ్రామానికి చెందిన అన్నమయ్య స్వర తరంగిణి కోలాటం కళాకారులు తిరుపతి వెళ్లారు. మంగళవారం గోవిందరాజులు ఆలయం నుంచి పద్మావతి అమ్మవారి గుడి వరకు జరిగిన సారె ఊరేగింపులో మునగపాక కళాకారులు ప్రదర్శనలిచ్చి అలరించారు. వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారు తమకు కల్పించిన భాగ్యమని కళాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏటికొప్పాకలో అధ్వానంగా పారిశుధ్యం

- గ్రామంలో పేరుకుపోయిన చెత్త
- పూడికతో నిండిన డ్రైనేజీలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి.. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి.. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు



ఏటికొప్పాక స్కూలు వద్ద దుర్గంధ పూరితంగా ఉన్న చెత్త



డ్రైనేజీలో కదలని మురుగు

అందించాలి.. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.. ఇవీ గ్రామాల్లో ప్రజలకు అధికారులు నిత్యం చెబుతున్న మాటలు... అయితే ఇందుకు భిన్నమైన పరిస్థితులు పల్లెల్లో కనిపిస్తున్నాయి. పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ గాలికొదిలేశారు. ఇందుకు ఉదాహరణగా మండలంలోని ఏటికొప్పాక మేజర్ పంచాయతీ అని చెప్పవచ్చు. గ్రామంలోని రోడ్లపై చెత్త పేరుకుపోయింది. విద్యార్థులు చదువుకునే జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధాన గేటు



ఏటికొప్పాకలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

వద్ద సైతం పరిస్థితి దయనీయంగా ఉంది. డ్రైనేజీల్లో పూర్తిగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సమీపంలో నివాసముంటున్న ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. పర్యవేక్షించాల్సిన పంచాయతీ సెక్రటరీ కానీ, ఈవోపీఆర్డీ కానీ ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండడంతో గ్రామంలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా తయారైంది. అధిక జనాభా ఉన్న ఈ గ్రామంలో పారిశుధ్యం తీరుపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానికులు అంటున్నారు. లక్కబొమ్మలకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఏటికొప్పాకలో పారిశుధ్యం ఇంత అధ్వానంగా ఉందంటే గ్రామానికి చెడ్డ పేరు వస్తుందని పలువురు గ్రామస్థులు అంటున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి ఏటికొప్పాక మేజర్ పంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో కొక్కిరాపల్లి దుర్గమ్మ జాతర

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల



దుర్గమ్మను దర్శించుకుంటున్న పప్పల చలపతిరావు, కూటమి నేతలు

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లిలో వెలసిన దుర్గమ్మ అమ్మవారి జాతర మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు నుంచి స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పప్పల చలపతిరావు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు చలపతిరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొఠారు సాంబ, కూటమి నేతలు రాజాన సూర్యనాగేశ్వరరావు, కరణం రవికుమార్, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, బోదెపు రమణ, సూరకాసుల రమణబాబు, నానేపల్లి సుబ్బయ్యనాయుడు, బీముని సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక బోనాల పండగ

ఎస్.రాయవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో మంగళవారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. నూకాంబిక అమ్మవారి ఆలయ 6వ వార్షికోత్సవంలో భాగంగా మహిళలు పెద్దఎత్తున బోనాలతో పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాల నడుమ తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం నుంచి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, టీడీపీ నేత బండి నాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ సియ్యాదుల అచ్యుత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం అగ్రహారంలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

హుండీల్లో చోరీ

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి అల్లూరి సీతారామరాజు కాలనీలోని రెండు ఆలయ హుండీలను పగులగొట్టి సుమారు 10 వేల రూపాయలు పైబడి నగదు చోరీకి గురైనట్టు స్థానికులు తెలిపారు. కాలనీలోని యానాద్రి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న హుండీ పగులగొట్టి ఉండడాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. హుండీలోని 10 వేల రూపాయలు నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. అదేవిధంగా సమీపంలోని పెదపల్లి రైల్వే గేటు వద్ద ఉన్న వినాయకుడి విగ్రహం వద్ద ఉన్న హుండీని పగులగొట్టి ఉండడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యానాద్రి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న సీసీ ఫుటేజీని స్థానికులు పరిశీలించి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మంగళవారం రాత్రి 1.30 గంటల సమయంలో అనుమానాస్పదంగా ఆలయం వద్ద సంచరించిన దృశ్యాలను గుర్తించారు. ఆ వివరాలను పోలీసులకు అందజేసినట్టు తెలిపారు. నిత్యం జనం సంచరించే ప్రధాన కాలనీలోని ఆలయ హుండీలకే రక్షణ లేకపోతే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో గతంలో వలె పోలీసుల రాత్రి గస్తీ ఉండడం లేదని పట్టణ ప్రజలు అంటున్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే రైతన్నా.. మీకోసం

కోటవురట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాల కోసమే రాష్ట్రప్రభుత్వం రైతన్నా.. మీకోసం సర్వే నిర్వహిస్తుందని మండల వ్యవసాయాధికారిణి సరోజని అన్నారు. రెండో రోజు మంగళవారం రైతన్నా మీకోసంలో భాగంగా సచివాలయం సిబ్బంది ఇంటింటికి తిరిగి అన్నదాత సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 18 సచివాలయాల పరిధిలో గల 3,233 మంది రైతుల ఇళ్లకు వెళ్లి సర్వే చేశామన్నారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నామన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



పెదబోదిగల్లం హైస్కూల్లో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న పెదబోదిగల్లం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్‌తో పాటు వివిధ పోటీలు నిర్వహించారు. మంగళవారం పాఠశాల హెచ్‌ఎం ఎస్.జయశ్రీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు ఏపీఎల్ఎస్.కుమారి విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విజేతలకు ఈనెల 26న నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్.ఆచార్యులు, వి.పద్మావతి, శ్రీదేవి, రమేశ్, నాగేశ్వరరావు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎస్.రాయవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యాలు చట్ట ప్రకారం మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎలమంచిలి కోర్ట్ ప్యానెల్ లాయర్ టి. నూకరాజు అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినం సందర్భంగా మంగళవారం గుడివాడ పంచాయతీ పంచాయతీ పరిధిలోని సాయి మెరైన్ రొయ్యల పరిశ్రమను కోర్టు పారా లీగల్ వలంటీర్లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు గురించి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి కోర్ట్ పారా లీగల్ వలంటీర్లు చిరంజీవి, సియ్యాదుల నాగేశ్వరరావు, కుమారి, చేపల రాజు, సురేష్, విజయ, సంతోషి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయ 25వ వార్షికోత్సవం

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం 25వ వార్షికోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు అయ్యప్ప సేవా సమితి ప్రతినిధి గణేశ్ స్వామి తెలిపారు. అయ్యప్ప భక్తులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పురవీధుల్లో అయ్యప్పలంతా పేటతుళ్లై నృత్యాలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ చేస్తామన్నారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవం

రాంబిల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లాలంకోడూరు గ్రామంలో ఈనెల 26న సుబ్రమణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలు నుంచి స్వామి వారి సన్నిధిలో పూజలు, హోమాలు, అభిషేకాలు జరగనున్నాయి. వేదపండితులు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు.

మునగపాకలో..

మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 26వ తేదీన సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు జరగనున్నాయి. ఇందుకుగాను మునగపాక, తిమ్మరాజుపేటల్లో అయ్యప్పస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. తిమ్మరాజుపేటలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలిలో బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని నాగేంద్రస్వామి ఆలయంతో పాటు, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, కొత్తపేట సీతారాముల ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలక కమిటీల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని కమిటీల ప్రతినిధులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుపాలెం వై.జంక్షన్ వద్ద మంగళవారం పోలీసులు కేసులు నమోదు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో యువకుడు ప్రసాద్‌తో పాటు హోంగార్డు చంటికి తీవ్ర గాయాలయ్యాయి. తుని ప్రాంతానికి చెందిన ప్రసాద్ అనే యువకుడు ఎలమంచిలి నుంచి తుని వైపు బైక్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రేగుపాలెం సాయిబాబా ఆలయం వద్ద రోడ్డుపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఎలమంచిలి నుంచి వస్తున్న ఈ బైక్‌ను పోలీసులు నిలిపారు. ఆసమయంలో బైక్ అదుపు తప్పి పడిపోవడంతో బైకిస్ట్ ప్రసాద్‌తో పాటు హోంగార్డుకు తీవ్ర గాయాలయ్యాయి. హోంగార్డును వెంటనే పోలీసులు ద్విచక్రవాహనంపై ఎలమంచిలి ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు ప్రసాద్‌ను అంబులెన్స్‌లో తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రాంబిల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవిందపాలెంకు చెందిన బర్నికిలా రమణ (45) గ్రామానికి సమీపంలోనే జీడిమామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ నాగేంద్ర మంగళవారం తెలిపారు. ఆ వ్యక్తి కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, తరచూ అసహజంగా ప్రవర్తిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రమణ తిరిగి ఇంటికి రాలేదన్నారు. గోవిందపాలెం-వాడపాలెం గ్రామాల మధ్య ఉన్న జీడిమామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థుడు బర్నికిలా వెంకటరావు చెప్పడంతో రమణ భార్య లక్ష్మికి, ఆయన కుటుంబ సభ్యులు హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని రమణ మృతి చెందినట్టు గుర్తించారన్నారు. ప్రాథమిక విచారణలో ఎటువంటి అనుమానాస్పద పరిస్థితులు కనిపించలేదన్నారు. రమణ భార్య బర్నికిలా లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

రైతన్నా.. మీ కోసంలో అన్నదాతలు పాల్గొనాలి

నక్కపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నిర్వహించే రైతన్నా.. మీకోసం వారోత్సవాల్లో అన్నదాతలు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని డీపీఎం సీహెచ్.లచ్చన్న తెలిపారు. మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పర్యటించిన ఆయన రైతులను కలిసి రైతన్నా.. మీ కోసం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రూపొందించిన ఐదు సూత్రాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందితో సమవేశమై.. రైతుల సూచనలు, విశ్లేషణలు, ఫిర్యాదులు తీసుకుని డిసెంబరు 3వ తేదీన 2026-27 ప్రణాళికను రూపొందించాలన్నారు. ముఖ్యంగా గిట్టుబాటు ధర, ప్రకృతి సేద్యంపై రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఉమాప్రసాద్, ఏఈఓ సాయికుమారి, వ్యవసాయ సహాయకులు ధనరాజు, రాజ్యలక్ష్మి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

మునగపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓటీపీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మండలంలో మూలపేటలో మంగళవారం రాత్రి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు దారుణంగా పెరిగిపోయాయన్నారు. ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా నష్టపోక తప్పదని హెచ్చరించారు. అదేవిధంగా సోమవారం నాగులాపల్లిలో చోరీ జరిగినట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేయండి

పాయకరావుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్లు లేని అర్హులకు ఇంటి స్థలం మంజూరుకు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు కోరారు. రాష్ట్రంలో కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో భాగంగా ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలం, ఇళ్లు మంజూరుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం మంజూరు చేస్తారన్నారు. ఇందుకోసం ఈనెల 30వ తేదీలోగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం

పాయకరావుపేట రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం గ్రామం శివారులో ఎనిమిది మద్యం సీసాలతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం ఏఎస్ఐ గోవింద్ సిబ్బందితో కలిసి వెళ్లారన్నారన్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తిని పట్టుకుని పరిశీలించగా ఎటువంటి రశీదు లేకుండా ఎనిమిది మద్యం సీసాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్ : భార్యాభర్తలకు గాయాలు

ఎలమంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగుపాలెం జంక్షన్ సమీపంలో హైవేపై బైక్‌ను వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయని రూరల్ ఎస్ఐ ఉపేంద్ర మంగళవారం తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఇత్తంశెట్టి సూర్యనారాయణ, అతని భార్య సత్యవతి బైక్‌పై సోమవారం ఉదయం రేగుపాలెం సమీపంలోని ఫ్లిప్ కార్టు కార్యాలయం వద్దకు వచ్చేసరికి తుని నుంచి అనకాపల్లి వైపు వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో గాయపడిన భార్యాభర్తలను 108లో అనకాపల్లి ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడి మృతి

అచ్యుతాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువాడ శివారు చిట్టిబోయినపాలెంకు చెందిన గీత కార్మికుడు దొడ్డి నాగరాజు(40) మంగళవారం ఉదయం కల్లు తీసేందుకు చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. తాడిచెట్టును అనుకుని ఉన్న అరటి చెట్లపై నాగరాజు పడి ఉంటే గాయాలతో బయటపడేవాడని స్థానికులు తెలిపారు. చెట్టు పైనుంచి నేరుగా నేలపై పడడంతో మృతి చెందాడని వారు చెపుతున్నారు. స్థానిక సీఐ చంద్రశేఖరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో రెవెన్యూ డివిజన్

... 5వ పేజీ తరువాయి

కోసం ప్రజలు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ప్రధానంగా అధిక వర్షాలు, తుఫానుల సమయంలో తక్షణ సహాయక చర్యలు కాస్త ఆలస్యమవుతున్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం నక్కపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి వంగలపూడి అనితతో పాటు పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం నక్కపల్లి మండలంలో డీఎల్ పురం, చందనాడ, వేంపాడు, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట పరిసరాల్లో నక్కపల్లి సెజ్ ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతోంది. మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్కు వంటి ప్రముఖ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాంతంలో 16వ నంబరు జాతీయ రహదారి, సముద్ర తీర ప్రాంతం కనెక్టివిటీ ఉన్నందున భవిష్యత్తులో జరగబోయే పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నక్కపల్లిలో ప్రత్యేకంగా ఒక రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పడితే ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వేగం గా అందుతాయని ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాలయాల్లో తాగునీటి పరీక్షలు తప్పనిసరి

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. జిల్లాలో జల్‌జీవన్‌మిషన్ పనులను సక్రమంగా అమలు చేయాలని జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం కార్యనిర్వాహక ఇంజనీర్ అనిల్‌కుమార్‌కు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం కార్యనిర్వాహక ఇంజనీర్ జె.అనిల్‌కుమార్, డీఈఓ ఎ. సావిత్రి, జడ్పీ సీఈవో శివ నారాయణ మూర్తి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆశాదేవి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మంగవేణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హైమావతి, డీఆర్‌డీఏ శచిదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణతకు సంకల్పం

... 5వ పేజీ తరువాయి

ఉంది. ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత 65 శాతం, వృత్తి విద్యలో 74 శాతం ఉంది. రాష్ట్ర స్థాయిలో చూసుకుంటే జిల్లాలో ఇంటర్ ఫలితాలు అట్టడుగు స్థాయిలో ఉండడంతో కలెక్టర్ విజయకృష్ణన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కళాశాల వసతిగృహాల్లో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు విద్యార్థులను చదివించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులను ఆదేశించారు. ఏ కేటగరీ విద్యార్థులు ఇంకా మెరుగైన స్థాయికి, బీ కేటగిరీ వారిని ఏ కేటగిరీకి తీసుకు రావడానికి, సీ కేటగిరీ విద్యార్థులను తప్పనిసరిగా పాస్ చేయించడానికి అధ్యాపకులు ప్రయత్నించాలని ఆదేశించారు. కాగా శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేస్తున్నామని డీఐఈవో వినోద్‌బాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

విజయశ్రీ బ్లడ్ సెంటర్ మూసివేత

... 5వ పేజీ తరువాయి

ఆదేశాల మేరకు మూడు నెలల కిందట రాష్ట్రవ్యాప్తంగా బ్లడ్ బ్యాంకుల్లో ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం అధి కారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా మహారాణిపేటలోని విజయశ్రీ బ్లడ్ సెంటర్‌కు వెళ్లిన అధికారులకు అక్కడి పరిస్థితులను చూసి కళ్లు బైర్లు కమ్మాయి. సాధారణంగా బ్లడ్ బ్యాంక్ నిర్వహించాలంటే తప్పనిసరిగా మెడికల్ ఆఫీసర్, టెక్నీషియన్, స్టాఫ్ నర్సు ఉండాలి. అయితే, విజయశ్రీ సెంటర్‌లో టెక్నీషియన్ తప్ప ఎవరూ లేరు. అలాగే, రక్తాన్ని శుద్ధి చేసే పరికరాలను అధికారులకు సమాచారం ఇవ్వకుండానే మరోచోటకు తరలించినట్టు, రక్తాన్ని సేకరించేటప్పుడు రక్తదాతకు సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని తీసుకోవడం లేదని గుర్తించారు. రక్తదాత నుంచి రక్తాన్ని సేకరించిన సమయంలో గానీ, తరువాత గానీ ఏదైనా ఇబ్బంది కలిగితే ప్రాథమిక చికిత్స అందించే పరిస్థితి అక్కడ లేదు. ఈ సెంటర్‌లో లోపాలను గుర్తించి సమాధానం ఇవ్వాలని కోరుతూ మూడు నెలల కిందట అధికారులు నోటీసులు జారీచేశారు. నెలలు గడిచినప్పటికీ సమాధానం ఇవ్వకపోవడంతో గత నెలలో మరోసారి తనిఖీలు నిర్వహించారు. అప్పటికీ అదే పరిస్థితి కొనసాగడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దానిని ఆధారంగా చేసుకున్న ఔషధ నియంత్రణ, పరిపాలన విభాగం డైరెక్టర్ బ్లడ్ సెంటర్‌ను మూసేయాలంటూ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది సహాయంతో సెంటర్‌ను క్లోజ్ చేశారు.

అస్తవ్యస్తంగా ప్రధాన రహదారులు

ఆద్యంతం గతుకులు

రోడ్లపై ఎక్కడికక్కడే తేలిపోయిన రాళ్లు
వాహన చోదకులు, ప్రయాణికుల అగచాట్లు
పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు


లక్ష్మీదేవిపేట గేటు జంక్షన్‌లో దెబ్బతిన్న రహదారి

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):
పట్టణంలోని ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. ఆద్యంతం గోతులు ఏర్పడ్డాయి. ఎక్కడికక్కడే రాళ్లు తేలిపోయాయి. చాలా చోట్ల డొచ్చులు ఊడిపోయాయి. ఫలితంగా వాహన చోదకులు, ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చూడాల్సి వస్తోంది.

పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం, కొబ్బరికాయల మార్కెట్, రావుగోపాలరావు కళాక్షేత్రం, నాయుళ్లవీధిలోని లక్ష్మీదేవిపేటగేటు జంక్షన్‌తో పాటు


రావుగోపాలరావు కళాక్షేత్రం వద్ద దెబ్బతిన్న రహదారి

భీమునిగుమ్మం, దాసరిగెడ్డ తదితర ప్రాంతాల్లో రహదారులు గోతుల మయమయ్యాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి సమయంలో గోతుల్లో వాహనాలు పడడం వల్ల అదుపుతప్పి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వాటిని మెరుగుపరిచేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మార్కెట్‌రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. కొబ్బరికాయలు, అరటిగెలలు, కూరగాయలు వ్యాపారం ఉదయం, మధ్యాహ్నం వేళల్లో జరుగుతుంటుంది. చిల్లర వర్తకులు తమ వ్యాపారానికి అవసరమయ్యే కూరగాయలు లగేజీ రిక్షాల్లో తీసుకొని వెళ్తుంటారు. గోతుల కారణంగా లగేజీ రిక్షాలు దెబ్బతింటున్నాయని రిక్షా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల రహదారుల్లో రాళ్లు తేలి ఉండడంతో ఆ ప్రాంతంలో వాహనాలపై వెళ్లే వారు రాళ్ల కారణంగా అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయం, రావుగోపాలరావు కళాక్షేత్రం, నాయుళ్లవీధి రహదారులు నిత్యం రద్దీతో ఉంటాయి. వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గాల్లో విద్యాసంస్థలు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆసుపత్రులు, ఎరువుల దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. వీటి కోసం వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. పట్టణంలో రహదారులు పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం అన్యాయమని వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ రహదారులను మెరుగుపరిచి ప్రయాణానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా


ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శేఖర్‌ను వివరణ కోరగా రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులకు టెండర్లు పిలవడం జరిగిందని, టెండర్లు ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు చేపడతామని తెలిపారు.


కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డు పై గోతులు


కేజీబీవీలో కలప నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

నాణ్యతాప్రమాణాలతో భవనాలు నిర్మించండి

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలను నాణ్యతా ప్రమాణాలతో పక్కాగా నిర్మించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశించారు. మండలంలోని తేగాడ గ్రామంలో కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న భవనాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నిర్మాణాలు నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, అక్కడ విద్యార్థినులతో మాట్లాడారు. యోగా, ప్రాణాయామం, శారీరక దారుఢ్యం పెంపొందుకొనేలా క్రీడలు ఆడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు

కొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని రింగు రోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పలు సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజా సేవలోనే నిత్యం మమేకమై ఉంటానని, ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

▸▸ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ


సీఎం సహాయనిధి మంజూరు పత్రం అందిస్తున్న పీలా

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. కోట్నివీధిలో మంగళవారం రెండు కుటుంబాలకు సీఎం సహాయ నిధి కింద రూ.1.16 లక్షలు మంజూరు కాగా, ఆ పత్రాలను బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన పేదలను ఆర్థికంగా ఆదుకోవడమే సీఎం సహాయ నిధి లక్ష్యమన్నారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి వైపు తీసుకువెళ్తున్న ఘనత సీఎం, డిప్యూటీ సీఎంలదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, అధ్యక్షుడు తలారి లక్ష్మీప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్, నాయకులు కోట్ని కొండలరావు, కోట్ని రాంబాబు పాల్గొన్నారు.

వైద్య సేవలను మరింత మెరుగుపర్చండి

▸▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి


తుమ్మపాల పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

తుమ్మపాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి ఆదేశించారు. తుమ్మపాల పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేశారు. ఫార్మసీలో మందులు, ల్యాబ్ టెస్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు పీహెచ్‌సీ నుంచి అన్ని వేళల్లో వైద్య సేవలను అందించాలన్నారు. అలాగే రోగులతో గౌరవంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం.వాణీజగదీశ్వరి, యూడీసీ హరి, సూపర్‌వైజర్ మంగమ్మ, సిబ్బంది శారదా, చంద్రశేఖర్, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

కేఎన్ఆర్ పేటలో చోరీ

నాలుగు తులాల బంగారం.. 45 తులాల వెండి అపహరణ

కొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని కొత్తూరు నరసింగరావుపేట గ్రామంలో చోరీ జరిగినట్టు రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. మొల్లేటి సోహన్ ఇంట్లో సోమవారం రాత్రి దుండగులు ప్రవేశించి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారం, 45 తులాల వెండి వస్తువులు అపహరించుకుపోయారని ఫిర్యాదు అందినట్టు చెప్పారు. క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి వెళ్లి వెలిముద్రలు సేకరించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

సినీ దర్శకుడు గీతాకృష్ణపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు గీతాకృష్ణపై అనకాపల్లి జిల్లా మునగపాక మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన దళిత నాయకుడు జామి శివఅప్పలరాజు మంగళవారం పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దళిత వర్గానికి చెందిన వైద్యులు, ఇంజనీర్లకు ఎటువంటి ప్రతిభ ఉండదంటూ గీతాకృష్ణ చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గీతాకృష్ణతో పాటు ఆయన ఇంటర్వ్యూను ప్రసారం చేసిన ఛానల్‌పై చర్యలు తీసుకోవాలని శివఅప్పలరాజు డిమాండ్ చేశారు.

లింగ ఆధారిత వివక్షపై అవగాహన కార్యక్రమాలు

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీ శచీదేవి, అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లింగ ఆధారిత వివక్షపై పోరాటం చేసేందుకు ప్రజల్లో బాధ్యత పెరగాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు (డీడీ) శచీదేవి చెప్పారు. కలెక్టరేట్ డీఆర్‌డీఏ కార్యాలయంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నవంబరు 25 నుంచి డిసెంబరు 23వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. నాలుగు వారాల పాటు నిర్వహించే అవగాహన కార్యక్రమాల వివరాలను ఈ సందర్భంగా పీడీ వెల్లడించారు. ఈ క్రతువులో పంచాయతీరాజ్, శిశు సంక్షేమ, పోలీస్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సాంఘిక సంక్షేమ, విద్య, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికల ద్వారా బాధిత వర్గాలతో సమావేశం కావాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని విభాగాల అధికారులు పూర్తి సహకారం అందించి జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ జి.డైజి, ప్రాజెక్టు మేనేజర్లు ఎస్ఎస్ రత్నప్రభ, కె.కుమారస్వామి, పి.రమణ, పాల్గొన్నారు.

28 నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

లంకెలపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను నిర్వహించనున్నట్టు పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. అండర్-14 విభాగంలో బాల బాలికలకు వేర్వేరుగా జరిగే ఈ పోటీలకు క్రీడా మైదానం సిద్ధం చేయడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏర్పాట్లను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఖోఖో కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాల కోసం ఈ నెల 30లోగా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఒక ప్రకటనలో కోరారు. ఇల్లు లేని పేదవారికి ప్రభుత్వం మూడు సెంట్ల స్థలాన్ని మంజూరు చేస్తుందన్నారు. స్థలం ఉండి హౌసింగ్ పథకం కావాల్సిన వారు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా ఈపీడీసీఎల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు వెనుక ప్రాంతం, గౌరీ సంఘం, సతకంపట్టు, సాయిబృందావన కాలనీ, అంబేడ్కర్ కాలనీ, పోస్టాఫీస్, మహిళా కళాశాల, దాసరిగెడ్డ రోడ్డు, పల్లపువీధి బంగ్లా ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కశింకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అడ్డాం గ్రామంలో వృద్ధులకు మంగళవారం దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కశింకోట పీఏసీఎస్ చైర్మన్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లవిల్లి భుజంగరావు, ఉపాధ్యక్షుడిగా గెంజి వెంకటరమణ, కార్యదర్శిగా రొంగలి హేమలత, సహాయ కార్యదర్శిగా జి.సత్యనారాయణ, కోశాధికారిగా బొడ్డు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పెదపాటి సాయికుమార్, గొల్లు రాజేశ్‌ను నియమించారు. అనంతరం వీఆర్వోలు శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం మండల అధ్యక్షుడిగా శేఖరరావు

సబ్బవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంఘం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా కె.శేఖరరావును తిరిగి ఎన్నికున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆదిరెడ్డి రవి, కార్యదర్శిగా వాత్సల్యరాయ్, సహాయ కార్యదర్శిగా ఎం.గోవిందరావు, కోశాధికారిగా ఎస్.నూకరత్నం ఎన్నికయ్యారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కామరాజు, పి.జగన్నాథరావు, దేముడుబాబు, ఎస్.రవి, ఈశ్వరరావు, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాలలో ద్విచక్ర వాహనం అపహరణకు గురైనట్టు మంగళవారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పెదగంట్యాడకు చెందిన గురుమూర్తి 23వ తేదీన రాత్రి తుమ్మపాలలోని తన బంధువు కాశీ ఇంటికి వచ్చి రాత్రికి అక్కడే వాహనం ఉంచాడన్నారు. మంగళవారం చూసేసరికి వాహనం కనిపించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

స్కూటీలకు దరఖాస్తు గడువు పెంచాలి

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల మూడు చక్రాల పెట్రోల్ స్కూటీల కోసం దరఖాస్తు గడువు పొడిగించినట్టు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూకఅప్పారావు కోరారు. మంగళవారం ఆయన గవరపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగులకు మూడు చక్రాల పెట్రోల్ స్కూటీలు నియోజకవర్గానికి పది చొప్పున పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్‌లో నవంబరు ఒకటి నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారన్నారు. మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో సంతకాలు చేసి ఇవ్వాల్సిన ధ్రువపత్రాలు సమయానికి ఇవ్వకపోవడంతో చాలా మంది దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోలేకపోయారన్నారు. సమస్యను అర్థం చేసుకొని దరఖాస్తుల స్వీకరణకు డిసెంబరు నెలాఖరు వరకు గడువు పెంచాలని ఆయన కోరారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పరవాడలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలపై తీర్మానాలు, చేయడంతో భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన జరుగుతుందన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.రమణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ అవసరం

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణమూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

కశింకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అన్ని శాఖల మండల అధికారులతో సమావేశమయ్యారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.76 లక్షలు మంజూరయ్యాయన్నారు. రూ.40 లక్షలతో తీడ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న సంపద తయారు కేంద్రాన్ని, బస్టాండుకు రంగులు తదితర అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామన్నారు. ఈ పనులన్నీ జనవరిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈ వేణుగోపాల్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ హెచ్చరించారు. పూడిమడకరోడ్డులో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలను తగ్గించడంలో యువత పాత్ర కీలకమని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని ఆయన సూచించారు. అలాగే కొత్త చట్టాల గురించి వివరించారు. అలాగే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ ఎస్ఐ డి.శేఖరం అవగాహన కల్పించారు.

బిజినెస్ ఇన్ రూరల్ ఏరియాపై ఐఐఎం విద్యార్థులకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఐఐఎం విద్యార్థులు

సబ్బవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డూయింగ్ బిజినెస్ ఇన్ రూరల్ ఏరియా అంశంపై ఐఐఎం (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) విద్యార్థులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. స్థానిక జాగృతి కార్యాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాగృతి ఎండీ కె.సుజాత మాట్లాడుతూ సంస్థ మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను వివరించారు. సీఈవో మౌక్తిక పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో వివరాలను తెలిపారు. ఐఐఎం ప్రొఫెసర్ జయంత్, సుధారాణి, క్లాస్ అసిస్టెంట్ భరత్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

పరవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ ఎన్.విజయకుమారి సూచించారు. దేశపాత్రునిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భద్రత, న్యాయపరమైన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయురాలు దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధికి కృషి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో పీపీ పంతులు

సబ్బవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా పంచాయతీలు పనిచేయాలని మండల పరిషత్ పరిపాలనాధికారి పీపీ.పంతులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఈ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల పురోగతి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, వెలుగు సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

అరకు పార్లమెంటరీ వైసీపీ పరిశీలకుడిగా 'శరగడం'


శరగడం చినఅప్పలనాయుడు

పెందుర్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అరకు పార్లమెంటరీ వైసీపీ పరిశీలకుడిగా పెందుర్తికి చెందిన శరగడం చినఅప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం శరగడంకు నియామక ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ రూరల్ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడిగా పనిచేసిన అప్పలనాయుడుకు నాలుగు దశాబ్దాలు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది.ఈ క్రమంలో అరకు పార్లమెంటరీ పరిధిలోని పార్వతీపురం, పాలకొండ, కురుపాం, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు శరగడం వైసీపీ పరిశీలకుడిగా వ్యవహరిస్తారు. తనను పరిశీలకుడిగా తనను నియమించినందుకు పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు ఈ సందర్భంగా శరగడం కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్చరీలో రాష్ట్రానికి వన్నె తేవాలి


సాయి తేజకు ఆర్థిక సహాయం అందిస్తున్న కలెక్టర్

పాడేరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చూపి రాష్ట్రానికి వన్నె తేవాలని ఓ విద్యార్థిని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఏ ఎస్. దినేష్‌కుమార్ అన్నారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ అరకు స్పోర్ట్స్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న హుకుంపేట మండలం శోభకోటకు చెందిన వంతాల లలిత్ సాయి తేజ సబ్ జూనియర్ నేషనల్ ఆర్చరీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఆ విద్యార్థికి ప్రయాణ ఖర్చులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. క్రీడా రంగంలో మరింతగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్పోర్ట్స్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జావెలిన్‌త్రోలో ద్వితీయ స్థానం


విద్యార్థినికి మెడల్ ప్రధానం చేస్తున్న దృశ్యం

జి.మాడుగుల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పల్నాడు జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో అండర్ -17 విభాగంలో నుర్మతి పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్న కిముడు కళ్యాణి రెండో స్థానం నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. త్వరలో యూపీలో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నట్టు పాఠశాల పీడీ మురళీనాయుడు,హెచ్‌ఎం. శివలింగం నాయుడు తెలిపారు.

రైవాడ జలాశయంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


అప్పలరాజు మృతదేహం

అనంతగిరి, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జీనబాడు బోటురేవు సమీపంలోని ఆదివారం నాటుపడవ బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా.. ఇద్దరు గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతైన గాలి అప్పలరాజు, డెబర రమేశ్ కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సోమవారం నుంచి గాలింపు చర్యలు చేపడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం ప్రమాదం జరిగిన సమీపంలో గాలి అప్పలరాజు మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. దీంతో ఈ మృతదేహం వద్ద తల్లి పార్వతమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. తహసీల్దార్ వీరభద్రచారి, అరకు సీఐ హిమగిరి, ఎస్ఐ శ్రీనివాసరావు, రేంజర్ రాజాబాబు పాల్గొన్నారు. మరొకరి కోసం గాలిస్తున్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేలా బోధన


విద్యార్థులసామర్థ్యాలను పరిశీలిస్తున్న అధికారి కృష్ణమూర్తి

కొయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగు పడేలా బోధన చేయాలని యు. చీడిపాలెం క్లస్టర్ కాంపెక్సు పాఠశాలల పర్యవేక్షణ అధికారి పి. కృష్ణ సూచించారు. మంగళవారం క్లస్టరు పరిధిలోని ఎర్రగొండ ఎంపీ ఎలిమెంటరి పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి ఉపాధ్యాయిని మంగను అభినందించారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట యు. చీడిపాలెం మోడల్ స్కూల్ హెచ్‌ఎం బాలకృష్ణ పాల్గొన్నారు.

సీపీఐ నేత వర్ధంతి

కొయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) సీపీఐ నేత దివంగత కొర్రు సన్యాసిరావు పోరాటాలు మరువలేనివని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇరువాడ దేముడు, డి. కనకరాజు, పార్టీ మండల కార్యదర్శి సూరిబాబు పేర్కొన్నారు. సన్యాసిరావు 13వ వర్ధంతిని మంగళవారం పార్టీ మండల కార్యదర్శి సూరిబాబు ఆధ్వర్యంలో చింతలపూడిలో ఘనంగా నిర్వహించారు. కుటుంబీకులు పాల్గొన్నారు.


బ్రోచర్లను రైతులకు అందచేస్తున్న కొయ్యూరు మాజీ ఎంపీపీ, తదితరులు


పెదపాడు పోస్టర్ల ఆవిష్కరణలో కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు, అధికారులు, రైతులు

'రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'

కొయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ జి. సత్యనారాయణ అన్నారు మంగళవారం మండలంలోని మర్రివాడ పంచాయతీలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్రోచర్లను రైతులకు పంపిణీ చేసి ప్రభుత్వ ఆశయాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ ఐదు విధానాలు కార్యాచరణలో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ ఫుడ్ ప్రోసెసింగ్ తదితర అంశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులువెంకటరావు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: కూటమి ప్రభుత్వం వ్యవసాయంలో అమలు పంచసూత్రాలు అన్నదాతకు అండగా నిలుస్తాయని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు అన్నారు. మండలంలో పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ పంచసూత్రాల అమలుకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, గ్రామ కమిటీ పంచాయతీ అధ్యక్షులు భీమరాజు, మాజీ ఎంపీపీ దన్నేరావు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు భాస్కరరావు, గిరిజనులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని ఏవో వరప్రసాద్ తెలిపారు. మంగళవారం కోరాపల్లి పంచాయతీలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న రబీ కాలానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మినుములు వంటి విత్తనాలు పంపిణీకి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.పెదబాలన్న, కె. శ్రీనివాసనాయుడు, వెంకటరమణ, సిబ్బంది ప్రశాంత్‌కుమార్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

హుకుంపేట; మండలంలోని రంగశీల పంచాయతీలో సచివాలయ సిబ్బంది మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రైతులకు భూముల వారసత్వ పట్టాలు మార్పు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం జమ కాని వారు తమకు వెంటనే తెలియజేస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనుష, డి.ఎ. రాజు, వీఆర్‌వో రవి, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు

▸▸ నక్సల్స్ బాధితులు, గిరిజనులు ర్యాలీ


అన్నవరంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న గిరిజనులు

చింతపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులని నక్సల్స్ బాధిత గిరిజనులు అన్నారు. మంగళవారం మండలంలోని అన్నవరంలో నక్సల్స్ బాధితులు, గిరిజనులు మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా భారీ ర్యాలీ చేశారు. ఈసందర్భంగా మావోయిస్టు బాధిత గిరిజనులు మాట్లాడుతూ మావోయిస్టు ఉద్యమం వల్ల ఆదివాసీలకు ఒరిగేది ఏమీలేదన్నారు. మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ల నెపంతో అమాయక ఆదివాసీలను హత్య చేస్తున్నారని, ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆస్తులు, సెల్ టవర్లను ధ్వంసం చేస్తున్నారన్నారు. గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించకుండా అడ్డుకుంటున్నారన్నారు. మావోయిస్టు సిద్ధాంతాలు, పార్టీ విధానాలను వ్యతిరేకిస్తున్నామని, గిరిజన గ్రామాల అభివృద్ధిని కోరుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో అన్నవరం, తమ్మంగుల, బెన్నవరం, లోతుగెడ్డ పంచాయతీల మావోయిస్టు బాధితులు, గిరిజనులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మావోయిస్టులకు వ్యతిరేకంగా గరిమండ వారపు సంతలో ప్లకార్డులతో గిరిజనులు నిరసన చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన గిరిజనులు మాట్లాడుతూ, మావోయిస్టులతో తమకు నష్టం తప్పితే లాభం లేదని, ఈ స్థితిలో తమ జోలికి రావద్దనికోరారు. మావోయిస్టుల బంద్‌లు, నిరసనలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇకనైనా గిరిజన గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సీలేరులో హీరో రవితేజ సందడి

- కొత్త చిత్రం షూటింగ్


సీలేరులో పండ్ల దుకాణం వద్ద హీరో రవితేజపై సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

సీలేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు మార్కెట్ సెంటర్‌లో ప్రముఖ సినీ హీరో రవితేజ సందడి చేశారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడ షూటింగ్‌లో పాల్గొన్నారు. రవితేజ, ప్రియా భవానీశంకర్ హీరో, హీరోయిన్‌లుగా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న కొత్త సినిమా షూటింగ్ ఇక్కడ జరిగింది. మార్కెట్‌లోని పండ్ల దుకాణం, స్వీట్ షాప్, జోళ్ల షాప్ వద్ద హీరో, హీరోయిన్లతో పాటు బేబీ నక్షత్రపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. షూటింగ్ చూసేందుకు ఉదయం నుంచి జనం అధిక సంఖ్యలో వచ్చారు. స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఏఆర్ పోలీసు సిబ్బంది ఎస్ఐ యాసిన్ పర్యవేక్షణలోషూటింగ్‌సజావుగాజరిగేలా చర్యలు తీసుకున్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎంపిక


ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

పాడేరురూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పాడేరు సర్కిల్ ఆఫీసు, ఎంఆర్‌టీ డివిజన్ (ఏపీఈపీడీసీఎల్)లో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) ఎన్నికలు డివిజన్ సెక్రటరీ వీఎస్‌ఆర్‌కే గణపతిరావు, నూకరాజు, చిరంజీవిల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించినట్టు యూనియన్ నాయకులు తెలిపారు. ఎంఆర్‌టీ డివిజన్ ప్రెసిడెంట్‌గా ఎం.వి.రమణసెక్రటరీగా ఎస్.నాగమోహన్, కోశాధికారిగా సీహెచ్.ఈశ్వరరావు, ఎస్.గోవిందరాజు, సర్కిల్ ఆఫీస్ ప్రెసిడెంట్‌గా ఎ.రాజారవీంద్ర, సెక్రటరీగా పి.సుందరరామారావు, కోశాధికారిగా ఈ.రామకృష్ణ, ఆఫీసు సెక్రటరీగా జి.కుసుమ కుమారి, అసిస్టెంట్ సెక్రటరీగా టి.సంధ్యారాణి ఎంపికయ్యారన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విజేతకు సన్మానం



మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభను చూపిన విద్యార్థిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

పాడేరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థి యు. చరణ్‌ను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి, అధ్యాపకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యసిస్తున్న చరణ్ సిల్వర్ మెడల్ గెలుపొందినట్టు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, పి.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష సిబ్బందితో సమీక్ష


మాట్లాడుతున్న అడిషనల్ ప్రోజెక్టు కో-ఆర్డినేటర్ స్వామినాయుడు

పాడేరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష సిబ్బంది జిల్లా కార్యాలయం నుంచి అడిగిన సమాచారాన్ని మండలాల్లోని సిబ్బంది సకాలంలో అందించేందుకు నిబద్ధతతో పనిచేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రోజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ వీపీ స్వామినాయుడు సూచించారు. పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగులతో మంగళవారం స్థానిక కాఫీ హౌస్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11 మండలాల సమగ్ర శిక్ష సిబ్బంది, ఎంఐఎస్.కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్‌ఎంటీలు, ఐఈ ఆర్పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

గిరి రైతుల అభ్యున్నతికి పెద్దపీట

ముంచంగిపుట్టు, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గిరిజన రైతుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని దారెల పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగస్వామి అన్నారు.మంగళవారం పంచాయతీ పరిధి కుమ్మరిపుట్టులో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ధర్మారావు, డిప్యూటీ ఎంపీడీవో జి.సత్యనారాయణ. ఏవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

చింతపల్లి: పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట రమణ అన్నారు. మంగళవారం కొత్తపాకలు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గిరిజన రైతులకు 90శాతం రాయితీపై రాజ్‌మా, అపరాలు, వేరుశనగ విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తుందన్నారు.

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రైతులు చైతన్యవంతులు కావాలని దామనాపల్లి అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉషా అన్నారు. మంగళవారం దామనాపల్లిలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు 90శాతం రాయితీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెసా మండల ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు, గ్రామపెద్దలు వసుపరి కన్నయ్య, గెమ్మెల సుబ్బారావు పాల్గొన్నారు.

రహదారి మంజూరుకు వినతి

జి.మాడుగుల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గెమ్మెలి పంచాయతీ చిన్నకొత్తూరులో రహదారి సదుపాయం కల్పించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మనపడాల్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారుతున్న మారుమూల ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. చిన్నకొత్తూరులో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఎంపీడీవో డేవిడ్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పిన్నంనాయుడు, నారాయణమ్మ, బొంజునాయుడు, పార్వతమ్మ, సరస్వతి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

జి.మాడుగుల, నవంబరు 25 (ఆంధ్రజోతి) : బాల్య వివాహాలుతో అనేక అనర్థాలుంటాయని పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలత స్పష్టం చేశారు. స్వస్తి నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బందవీధి, గాంధీనగర్ ఆశ్రమ పాఠశాలలో సందర్శించారు. బాల్య వివాహాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఆమె వెంట ఏటీడబ్ల్యూవో వి.నాగశిరిష, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న మెగా జాబ్ మేళా

పాడేరురూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహించ నున్నట్టు కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ తెలిపారు. ఈ పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని, 10, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొవచ్చని తెలిపారు. వివరాలకు 6302636174, 7569923256 సంప్రదించాలన్నారు.

డ్రోన్ ద్వారా అత్యవసర మందులు సరఫరా

▸▸ పాడేరు నుంచి ముంచంగిపుట్టుకు ట్రయల్ రన్ విజయవంతం


మందులతో ముంచంగిపుట్టు చేరుకున్న డ్రోన్

ముంచంగిపుట్టు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొండకోనల మధ్య నివసించే గిరిజనులకు సకాలంలో మందులందించేందుకు ప్రభుత్వం చేపట్టిన అత్యాధునిక డ్రోన్ ప్రయోగం మంగళవారం విజయవంతమైంది. జిల్లా కేంద్రమైన పాడేరు నుంచి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి డ్రోన్ సహాయంతో మందులను పంపిణీ పై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించిన ట్రయల్ రన్ సత్ఫలితాలను ఇచ్చింది. మండలంలో 23 పంచాయతీల పరిధిలోని అత్యధిక గ్రామాలు అడవులు, కొండల నడుమ విస్తరించి ఉన్నాయి. ఇక్కడ నుంచి ఆసుపత్రులు సుదూర ప్రాంతాల్లో ఉండటం, సరైన రవాణా సౌకర్యాలు లేక పాముకాటు, ప్రసవ సమయాల్లో రక్తం కొరత, గుండెపోటు తదితర అత్యవసర సమయాల్లో సమయం వృథా అయి ప్రాణాలు మీదకు వస్తోంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పైలట్ ప్రాజెక్టుగా డ్రోన్ల ద్వారా అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు మందుల సరఫరా చేస్తోంది. పాడేరు జిల్లా ఆసుపత్రి నుంచి అత్యవసర మందుల బాక్సుతో బయలుదేరిన డ్రోన్, గంటల తరబడి రోడ్డు మార్గంలో ప్రయాణించాల్సిన దూరాన్ని ఆకాశ మార్గంలో అతి తక్కువ సమయంలోనే అధిగమించి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి చేరింది. ఈ ప్రయోగాన్ని వైద్య శాఖ అధికారులు పర్యవేక్షించారు. ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా డ్రోన్ సురక్షితంగా గమ్యస్థానానికి చేరడంతోపాటు తిరుగు ప్రయాణం అవడంతో అధికారులు ఆనందం వ్యక్తంచేశారు. త్వరలో ఈ సేవలను ఏజెన్సీలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని అధికారులు తెలిపారు.

హెచ్‌ఐవీ సేవలకు ఐసీటీసీ వాహనం


వాహన సేవలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

పాడేరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన దూర ప్రాంత ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్ సేవలను అందించేందుకు మొబైల్ ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్,టెస్టింగ్ సెంటర్ ఐసీటీసీ వాహన సేవలు మరింత కీలకం కానున్నాయని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సమకూర్చిన కొత్త సంచార ఐసీటీసీ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార ఐసీటీసీ వాహనం ఇంటింటికి వెళ్లి కౌన్సెలింగ్, టెస్టింగ్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఐసీటీసీ మొబైల్ సేవలతో సకాలంలో బాధితుల గుర్తింపు, వ్యాధి వ్యాప్తి నిరోధానికి సహాయపడుతుందన్నారు. ఈ సంచార వాహనంలో కౌన్సిలర్, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్, డ్రైవర్ విధులు నిర్వహిస్తారన్నారు. వైద్య పరీక్షల సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారన్నారు. జిల్లా ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తి నాయక్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్.కిరణ్ కుమార్, టెక్నికల్ నిపుణులు, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగులు, డీఎండీవో ఎస్.చిరంజీవి, కిరణ్, కైలాశ్ పాల్గొన్నారు.

మహిళలపై హింసను నిరోధించాలి: న్యాయమూర్తి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రాములు

పాడేరురూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరిగే హింసలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ప్రథమ శ్రేణి జుడీషియల్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎ.రాములు అన్నారు. అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న అనేక రకాల ఘటనలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వనుము చిట్టబ్బాయి, వైస్.ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, న్యాయవాది టి.ప్రసాద్ నాయుడు, ఎన్ఎస్ఎస్ పీవో వి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

చింతపల్లిలో ట్రాఫిక్ సమస్య

చింతపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత బస్ స్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతున్నది. రహదారికి ఇరువైపులా ద్విచక్రవాహనాలు, సర్వీసు వాహనాలు పార్కు చేయడం వల్ల వాహనాలు తప్పించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం పాత బస్ స్టాండ్‌లో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఆస్పత్రికి వెళ్లేందుకు రోగితో వచ్చిన అంబులెన్సు 15 నిమిషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ పోలీసులు అందుబాటులో ఉండడంలేదు. ద్విచక్రవాహనదారులు, ప్రైవేటు వాహనాల యజమానాలు ఇష్టారాజ్యంగా పార్కు చేస్తున్నారు. ఇకనైనా పోలీసు, ఆర్టీయే అధికారులు పాత బస్ స్టాండ్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదివాసీలకు చీరలు పంపిణీ

చింతపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబసింగి పంచాయతీ చెరువులవేనం గ్రామంలో ఆదివాసీలకు చీరలను శాన్ చారిటీ ఫౌండర్, ఏపీటీడీసీ యూనిట్ మేనేజర్ సూరెడ్డి అప్పలరాజు పంపిణీ చేశారు. ఈ యూనిట్ మేనేజర్ అప్పలనాయుడు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోనున్న 120మంది మహిళలకు ఏయూ ఎవర్‌గ్రీన్ ఇంజనీర్ల సహకారంతో చీరలు, వృద్ధులకు పంచెలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతల సహకారంతో గిరిజన ప్రాంతంలో సామాజిక సేవా కార్యక్రమంలో నిర్వహిస్తున్నామన్నారు. మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్ పాల్గొన్నారు.

వరి కోతలు, కాఫీ పండ్ల సేకరణకు వాతావరణం అనుకూలం

చింతపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజులు వరి కోతలు, కాఫీ పండ్ల సేకరణకు అనుకూలమని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. అరకు, రంపచోడవరం, పాడేరు, చింతపల్లి డివిజన్ల పరిధిలో ఈనెల 30తేదీ వరకు వర్షసూచనలేదన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27.4, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15.5డిగ్రీలు ఉంటుందన్నారు.

మరో రెవెన్యూ డివిజన్

... 5వ పేజీ తరువాయి

కోసం ప్రజలు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ప్రధానంగా అధిక వర్షాలు, తుఫానుల సమయంలో తక్షణ సహాయక చర్యలు కాస్త ఆలస్యమవుతున్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం నక్కపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి వంగలపూడి అనితతో పాటు పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం నక్కపల్లి మండలంలో డీఎల్ పురం, చందనాడ, వేంపాడు, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట పరిసరాల్లో నక్కపల్లి సెజ్ ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతోంది. మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్కు వంటి ప్రముఖ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాంతంలో 16వ నంబరు జాతీయ రహదారి, సముద్ర తీర ప్రాంతం కనెక్టివిటీ ఉన్నందున భవిష్యత్తులో జరగబోయే పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని నక్కపల్లిలో ప్రత్యేకంగా ఒక రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పడితే ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వేగం గా అందుతాయని ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాలయాల్లో తాగునీటి పరీక్షలు తప్పనిసరి

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. జిల్లాలో జల్‌జీవన్‌మిషన్ పనులను సక్రమంగా అమలు చేయాలని జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం కార్యనిర్వాహక ఇంజనీర్ అనిల్‌కుమార్‌కు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం కార్యనిర్వాహక ఇంజనీర్ జె.అనిల్‌కుమార్, డీఈ ఎ. సావిత్రి, జడ్పీ సీఈవో శివ నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆశాదేవి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మంగవేణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హైమావతి, డీఆర్‌డీఏ శచీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణతకు సంకల్పం

... 5వ పేజీ తరువాయి

ఉంది. ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత 65 శాతం, వృత్తి విద్యలో 74 శాతం ఉంది. రాష్ట్ర స్థాయిలో చూసుకుంటే జిల్లాలో ఇంటర్ ఫలితాలు అట్టడుగు స్థాయిలో ఉండడంతో కలెక్టర్ విజయకృష్ణన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కళాశాల వసతిగృహాల్లో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు విద్యార్థులను చదివించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులను ఆదేశించారు. ఏ కేటగిరీ విద్యార్థులు ఇంకా మెరుగైన స్థాయికి, బీ కేటగిరీ వారిని ఏ కేటగిరీకి తీసుకు రావడానికి, సీ కేటగిరీ విద్యార్థులను తప్పనిసరిగా పాస్ చేయించడానికి అధ్యాపకులు ప్రయత్నించాలని ఆదేశించారు. కాగా శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేస్తున్నామని డీఐఈవో వినోద్‌బాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

విజయశ్రీ బ్లడ్ సెంటర్ మూసివేత

... 5వ పేజీ తరువాయి

ఆదేశాల మేరకు మూడు నెలల కిందట రాష్ట్రవ్యాప్తంగా బ్లడ్ బ్యాంకుల్లో ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా మహారాణిపేటలోని విజయశ్రీ బ్లడ్ సెంటర్‌కు వెళ్లిన అధికారులకు అక్కడి పరిస్థితులను చూసి కళ్లు బైర్లు కమ్మాయి. సాధారణంగా బ్లడ్ బ్యాంక్ నిర్వహించాలంటే తప్పనిసరిగా మెడికల్ ఆఫీసర్, టెక్నీషియన్, స్టాఫ్ నర్సు ఉండాలి. అయితే, విజయశ్రీ సెంటర్‌లో టెక్నీషియన్ తప్ప ఎవరూ లేరు. అలాగే, రక్తాన్ని శుద్ధి చేసే పరికరాలను అధికారులకు సమాచారం ఇవ్వకుండానే మరోచోటకు తరలించినట్టు, రక్తాన్ని సేకరించేటప్పుడు రక్తదాతకు సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని తీసుకోవడం లేదని గుర్తించారు. రక్తదాత నుంచి రక్తాన్ని సేకరించిన సమయంలో గానీ, తరువాత గానీ ఏదైనా ఇబ్బంది కలిగితే ప్రాథమిక చికిత్స అందించే పరిస్థితి అక్కడ లేదు. ఈ సెంటర్‌లో లోపాలను గుర్తించి సమాధానం ఇవ్వాలని కోరుతూ మూడు నెలల కిందట అధికారులు నోటీసులు జారీచేశారు. నెలలు గడిచినప్పటికీ సమాధానం ఇవ్వకపోవడంతో గత నెలలో మరోసారి తనిఖీలు నిర్వహించారు. అప్పటికీ అదే పరిస్థితి కొనసాగడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దానిని ఆధారంగా చేసుకున్న ఔషధ నియంత్రణ, పరిపాలన విభాగం డైరెక్టర్ బ్లడ్ సెంటర్‌ను మూసేయాలంటూ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది సహాయంతో సెంటర్‌ను క్లోజ్ చేశారు.

జీఎఫ్ఎల్ఎన్ పరీక్ష ప్రారంభం

మాకవరపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం ప్రభుత్వ పాఠశాల్లో జీఎఫ్ఎల్ఎన్ పరీక్ష నిర్వహించామని ఎంఈవో మూర్తి తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులు ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో లీప్‌యాప్ ద్వారా నిర్వహించామన్నారు. తెలుగు, ఇంగ్లీషు, గణితంలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో నిర్వహించామన్నారు. అనంతరం పైడిపాల పాఠశాలలో నిర్వహించిన పరీక్షను పరిశీలించారు. ఈపరీక్ష ఫలితాలను అనుసరించి రాబోయే 100 రోజుల్లో విద్యార్థులకు తరగతి తగ్గ సామర్థ్యాలు సాధించే వరకు బోధన చేస్తారన్నారు.

రాష్ట్ర స్థాయిలో నర్సీపట్నం విద్యార్థులకు పతకాలు


కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్‌పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో పతకాలు కైవసం చేసుకున్నారు. ఆదివారం కాకినాడ గాంధీనగర్‌లో 6వ రాష్ట్ర స్థాయి జూ జిట్స్ కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఏ కీర్తన బంగారు పతకం, పి.జాస్మినికృష్ణ ప్రియ, పి.రోహిత్ కృష్ణ సిల్వర్ మెడల్స్, ఆర్.హేమంత్, జి.సాత్విక్, ఏమనోజ్‌కుమార్, వి.అన్య, వి.వెంకటరమణ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. డిసెంబరు 23 నుంచి ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయిలో పోటీలలో కీర్తన, జాస్మిని కృష్ణ, లోహిత్ కృష్ణ ఎంపికయ్యారు. క్రీడాకారులను అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, కోచ్ ప్రసాద్, డైరెక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్

నాతవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.యర్రవరం-జిల్లేడిపూడి రూట్‌లో ఎన్ఆర్ఐ లెక్కల వెంకటేశ్వరరావు సొంత నిధులతో మంగళవారం ఎంపీడీవో సత్యశ్రీనివాసు, ఎస్ఐ వై తారకేశ్వరరావు జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వై తారకేశ్వరరావు మాట్లాడుతూ ఈ రూట్‌లో తుప్పలు విపరీతంగా పెరగడంతో స్థానికుల అభ్యర్థన మేరకు ఎన్ఆర్ఐ వెంకటేశ్వరరావు సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ డీసీ మెంబరు బాబులు, టీడీపీ నాయకులు కోరుప్రోలు వెంకటరమణ, ఆర్‌వీఎస్ చంద్ర, పంచాయతీ సెక్రటరి లోవ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాతకృష్ణాదేవిపేటలో ఉచిత వైద్య శిబిరం

కృష్ణాదేవిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేట రామాలయం వద్ద బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు విశాఖపట్నం శారదా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అజయ్ స్రవంతి తెలిపారు. సీపీఐ నేత మేకా సూరిబాబు వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, గాస్ట్రిక్, కిడ్నీలో రాళ్లు, మూత్రకోశ వ్యాధులకు వైద్య సేవలతో పాటు మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు.

త్వరలో డీజీ లక్ష్మిల ఆన్‌లైన్ సేవలు

- నర్సీపట్నంలో 53 డీజీ లక్ష్మిలు ఎంపిక
- ఒక్కొక్కరికి రూ.3 లక్షలు బ్యాంక్ రుణం
- ప్రధాన కూడళ్లలో బడ్డీలు ఏర్పాటు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు
- డిగ్రీ చదువుకున్న ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఆర్థిక ఆసరా

నర్సీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో డీజీ లక్ష్మిల ఆన్‌లైన్ డిజిటల్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. డిగ్రీ చదువుకున్న ఎస్‌హెచ్‌జీ మహిళలకు డీజీ లక్ష్మి పేరుతో కూటమి ప్రభుత్వం ఆర్థిక ఆసరా కల్పిస్తున్నది. మీ-సేవా కేంద్రాల తరహా సీఎస్‌సీ సెంటర్లు మంజూరు చేస్తున్నది. పురపాలక సంఘం మెప్మా పరిధిలో 1440 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఇందులో 25 నుంచి 30 సంఘాలను కలిపి ఒక శ్రమ సమైఖ్య చొప్పున 53


డీజీ లక్ష్మి కోసం సిద్ధం చేసిన కియోస్క్

సమైఖ్యలు ఉన్నాయి. సమైఖ్య నుంచి ఒకరు చొప్పున 53 మంది డీజీ లక్ష్మిని ఎంపిక చేసి, వారికి ఆన్‌లైన్ డిజిటల్ సేవలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న డీజీ లక్ష్మిలకు మెప్మా ద్వారా రూ.3లక్షలు బ్యాంకు రుణం ఇప్పిస్తారు. వారితో క్రియోస్క్ పెట్టించి కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయిస్తారు. మునిసిపాలిటీలోని జోగినాథునిపాలెంకి చెందిన డ్వాక్రా మహిళకు సీఎస్‌సీ మంజూరుచేశారు. కియోస్క్, సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేసిన ల్యాప్‌ట్యాబ్, ఫర్నీచర్ పంపించారు. త్వరలో ప్రారంభోత్సవం చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు, మిని బ్యాంకింగ్ సేవలు, విద్యుత్ బిల్లులు కట్టించుకోవడం, పోస్ట్‌ఆఫీసు సేవలు అందిస్తారు.

గంగాలమ్మ ఆలయ ప్రారంభోత్సవంపై ప్రొటోకాల్ వివాదం

- పాటించాలంటున్న టీడీపీ నేతలు
- కుదరదంటున్న వైసీపీ
- పోలీసులు జరిపిన చర్చలు విఫలం
- బహిష్కరిస్తాం : టీడీపీ నేతలు


ఇరువర్గాలతో మాట్లాడుతున్న రూరల్ సీఐ రేవతమ్మ

గొలుగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సాలికమల్లవరం గ్రామదేవత గంగాలమ్మ ఆలయ ప్రారంభోత్సవంపై స్థానిక వైసీపీ నేతలు ప్రొటోకాల్ పాటించాలని అధికార పార్టీ నాయకులు పట్టుపట్టడంతో మంగళవారం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సాలికమల్లవరంలో గంగాలమ్మ ఆలయానికి గత ప్రభుత్వ హయాంలో టీటీడీ నుంచి పది లక్షల రూపాయలు మంజూరయ్యాయి. దీంతో వైసీపీ మద్దతుతో గెలుపొందిన సర్పంచ్ నూకరత్నం భర్త ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే ఈనెల 26వ తేదీన ఆలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలో తమ ప్రభుత్వం ఉన్నందున ప్రొటోకాల్ పాటించాలని టీడీపీ నాయకులు పట్టుబట్టారు. దీంతో నర్సీపట్నం సీఐ రేవతమ్మ, గొలుగొండ ఎస్ఐ రామారావు ఇరువర్గాలతో సాలికమల్లవరంలో చర్చలు జరిపి శాంతియుతంగా ఇరువర్గాలు ఆలయ ప్రారంభం చేపట్టాలని సూచించారు. అయితే వైసీపీ వర్గం ప్రొటోకాల్‌పై ససేమిరా అనడంతో అధికార పార్టీ నేతలు ఆలయ ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ విలేకరులతో మాట్లాడుతూ ఇరువర్గాలపై బైండవర్ కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ చర్చల్లో డీటీ చైన్లు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'స్వామిత్వ సర్వే త్వరితగతిన చేపట్టాలి'

గొలుగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో స్వామిత్వ సర్వే త్వరితగతిన చేపట్టాలని జిల్లా సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గోపాల్‌రాజా ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారుతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని గ్రామాల్లో స్వామిత్వ సర్వే పూర్తి చేశారనే అంశంపై ఆరా తీశారు. త్వరితగతిన సర్వే పూర్తి చేయాలన్నారు. గ్రామకంఠాల్లో రికార్డులు పదిలం చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి మూర్తి, మండల సర్వేయర్ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనులకు సాయపడడం అభినందనీయం'


అసనగిరి గిరిజనులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నాతవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు సాయపడడం అభినందనీయమని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మంగళవారం సుందరకోట పంచాయతీ శివారు అసనగిరి గ్రామ గిరిజనులకు స్వాతి అకాడమీ, లైఫ్ స్కిల్ చారిటిబుల్ సొసైటీ సమకూర్చిన దుప్పట్లు, చీరలను ఎంపీపీ లక్ష్మణమూర్తి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా చలికాలంలో గిరిజనులకు దుప్పట్లు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పి. శ్రీను, జె. అమల, సీహెచ్ సుస్మిత, గణపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో భరత్‌కు తృతీయ స్థానం



నాతవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో నాతవరం గ్రామానికి చెందిన గుడపర్తి భరత్ తృతీయ స్థానం సాధించాడు. ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నక్కపల్లిలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు ప్రాతినిథ్యం వహించిన భరత్ తృతీయ స్థానం సాధించాడు. భరత్‌ను ఎస్ఐ తారకేశ్వరరావు అభినందించారు.

డిమాండ్ ఉన్న పంటలు పండించండి

మాకవరపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను పండించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని వ్యవసాయాధికారి డి.అప్పారావు అన్నారు. మండలంలో గిడుతూరు, తూటిపాలల్లో మంగళవారం నిర్వహించిన రైతన్నా.. మీకోసంలో పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వచ్చే పంటలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తాం : ఎంపీడీవో


రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని పరిశీలించిన ఎంపీడీవో

మాకవరపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో చాయసుధ అన్నారు. మంగళవారం తాడపాలలో రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని పరిశీలించారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంత రాయం కలుగుతుందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీడీవో దళితుల కాలనీలో రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తామని తెలిపారు. రోడ్డు పూర్తిగా క్లియర్ చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. దీనిపై పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు. దీంతో తాడపాల దళిత కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

రూ. 91 లక్షలతో రైవాడ కాలువపై బ్రిడ్జి నిర్మాణం


శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్, ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆనందపురం వద్ద రైవాడ కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి మంగళవారం విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జి శిథిలమై కూలిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విశాఖ నుంచి దేవరాపల్లి వెళ్లే బస్సులు సుమారు ఐదు నెలల నుంచి ఈ ప్రాంతానికి రద్దు చేశారు. కొన్ని బస్సులు కె. కోటపాడు మీదుగా రాకపోకలు సాగించాయి. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా స్థానిక ఎమ్మెల్యే బండారు విశాఖ కార్పొరేషన్ ద్వారా బ్రిడ్జి నిర్మాణానికి రూ. 91 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ పనులు ప్రారంభించడంతో తొమ్మిది గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేశ్, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైవాడ జలాశయాన్ని సందర్శించిన విశాఖ మేయర్

దేవరాపల్లి: రైవాడ జలాశ యాన్ని విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. జలాశయ స్థితిగతులను వివరాలను జలాశయ చైర్మన్ పాత్రునాయుడును అడిగి తెలుసుకున్నారు.మాజీ ఎంపీపీ భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, మురళి పాల్గొన్నారు.

తాగునీటిని సరఫరా చేయాలని నిరసన


ఖాళీ బిందెలతో కొత్తకోట అరుంధతి కాలనీ వాసుల నిరసన

రావికమతం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమకు తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ మేజరు పంచాయతీ కొత్తకోటలోని అరుంధతి కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ కాలనీలో 200 మంది దళిత కుటుంబాలున్నాయి. గ్రామంలోని 2.50 లక్షల లీటర్ల సామర్థ్యగల పెద్ద ట్యాంకు ద్వారా తాగు నీటి సరఫరా చేసేవారు. ఈ ట్యాంకు మరమ్మతుల పేరుతో కొంతకాలంగా గ్రామంలో రెండు రోజులకు ఒక్కసారి అసంపూర్తిగా తాగునీటి సరఫరా చేసేవారు. గత పది రోజులుగా ఆ నీటి సరఫరాను నిలిపివేయడంతో, దూరంగా రైతుల పొలాల్లోని బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్టు మహిళలు మంజేటి దేవరాజు, కంటిపాము లక్ష్మి, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కె. గోవిందరావు, దళిత సంఘ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని భాగ్యశ్రీ

రావికమతం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని మోపాడ భాగ్యశ్రీ జాతీయ స్థాయి 100 మీటర్ల పరుగు పందెంలో స్టాండ్ బైగా ఎంపికయింది. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థినికి లక్నోలో నిర్వహించనున్న పోటీలకు ఎంపికైనట్టు హైస్కూల్ హెచ్ఎం రామారావు మంగళవారం తెలిపారు.

కరక మాజీ సర్పంచ్ చినసత్యారావు మృతి


యన్నంశెట్టి చిన సత్యారావు (ఫైల్)

బుచ్చెయ్యపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో కరక గ్రామ మాజీ సర్పంచ్ యన్నంశెట్టి చిన సత్యారావు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. గతంలో ఆయన గ్రామ సర్పంచ్‌గా, కశింకోట వీఆర్ఓగా , ఎల్ఐసీ ఏజెంట్‌గా సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన భార్య రమణమ్మ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఆయన పార్థీవ దేహనికి విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ , జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొకివాడ కోటేశ్వరరావు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలియ చేశారు.

కలగా చోడవరం రెవెన్యూ డివిజన్

- అనకాపల్లి డివిజన్‌ను చోడవరానికి మార్చాలని కోరుతున్న స్థానికులు

చోడవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చోడవరంలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కలగానే మిగిలింది. మూడు దశాబ్దాల క్రితం నుంచి ఇక్కడ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలున్నాయి. అప్పటి నుంచి డివిజన్ కోసం చోడవరం, మాడుగుల నియోజకవర్గాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పలువురు కోరుతూ వస్తున్నారు. పార్టీలకు ప్రతీ ఎన్నికల్లో ఇదే విషయం ప్రధాన అంశంగా ఉండేది. అంతటి కీలకమైన ఈ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కలగా మారింది. తాజాగా నక్కపల్లిలో కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో చోడవరం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అనకాపల్లిలోని రెవెన్యూ డివిజన్ చోడవరంలో ఏర్పాటు చేస్తే వెనుకబడిన చోడవరం, మాడుగుల నియోజకవర్గాల అభివృద్ధికి దోహద పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో విశాఖ, నర్సీపట్నంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయాలున్న సమయంలో చోడవరం నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేటతో పాటు మాడుగుల నియోజకవర్గంలోని దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలు విశాఖ రెవెన్యూ డివిజన్‌లో ఉండగా, మాడుగుల, చీడికాడ, రావికమతం, రోలుగుంట మండలాలు నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో కొనసాగేవి. అప్పట్లో ఈ రెండు నియోజకవర్గాల ప్రజలకు అటు విశాఖ, ఇటు నర్సీపట్నానికి కూడా దూరంగా ఉండేది. కాలక్రమంలో 2014లో జిల్లాలో కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు సమయంలో అంతా చోడవరంలో రెవెన్యూ డివిజన్‌గా మారుతుందని ఆశించారు. అయితే, అప్పటి అనకాపల్లి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంత్రిగా ఉండడంతో రెవెన్యూ డివిజన్ అనకాపల్లిలోనే నెలకొల్పేందుకే ఆసక్తి చూపడంతో చోడవరానికి దక్కవలసిన రెవెన్యూ డివిజన్ అనకాపల్లికి తరలిపోయింది. విశాఖలో ఉండే చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని మండలాలను అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోకి మార్పు చేయగా, మిగిలిన మండలాలు యథాతథంగా నర్సీపట్నంలోనే ఉన్నాయి. కాగా వైసీపీ హయాంలో అనకాపల్లి జిల్లా కేంద్రంగా ప్రకటించడంతో అనకాపల్లిలో ఉన్న రెవెన్యూ డివిజన్ చోడవరానికి వస్తుందని అంతా ఆశించినా ఫలితం లేకపోయింది.


చోడవరం పట్టణం వ్యూ

అనకాపల్లి జిల్లా కేంద్రం, కొత్తగా ఏర్పాటు చేసే నక్కపల్లికి దగ్గరలోనే ఉన్నందున.. అనకాపల్లిలో ఉన్న రెవెన్యూ డివిజన్ కేంద్రాన్ని చోడవరానికి తరలిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ఈ ప్రాంత వాసుల్లో వ్యక్తమవుతోంది. రెవెన్యూ డివిజన్ చోడవరంలో ఏర్పాటు చేస్తే చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని 8 మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం కూడా ఉంటుందని అంటున్నారు. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రంలోనే అగ్రగామిగా ఏపీ గ్రామీణ బ్యాంకు

- ఏపీజీబీ జనరల్ మేనేజర్ రాజశేఖరం

రోలుగుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఏపీ గ్రామీణ బ్యాంకు అగ్రగామిగా ఉందని ఏపీజీబీ జనరల్ మేనేజర్ ఎ.రాజశేఖరం చెప్పారు. మంగళవారం రోలుగుంటలో నూతనంగా నిర్మించిన గ్రామీణ బ్యాంకు కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం స్వయం సహాయ సంఘాల మహిళలు, ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాలుగు గ్రామీణ బ్యాంకుల కారణంగా రాష్ట్రంలోని అత్యధిక శాఖలు కలిగిన గ్రామీణ బ్యాంకుగా అవతరించిందన్నారు. రాష్ట్రంలోని ఏ బ్యాంకుకు లేని ఖాతాదారులు గ్రామీణ బ్యాంకుకు 1.21 కోట్ల మంది ఉన్నారని చెప్పారు. మహిళలు తాము పొందిన రుణాలతో ఆర్థికంగా ఎదిగేలా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. పాడి పశువుల పోషణకు కూడా రుణాలు అందిస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు ఎటువంటి పూచీ లేకుండా రూ.20 లక్షల వరకు రుణాలు పొందవచ్చునని ఆయన తెలిపారు. అనంతరం రీజనల్ మేనేజర్ ఎస్.సతీశ్‌చంద్ర మాట్లాడుతూ అన్ని బ్యాంకుల కన్నా ఏపీజీబీ అధిక వడ్డీ చెల్లిస్తుందన్నారు. సిరి 444 పథకం ద్వారా స్త్రీలకు 7.95 శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. అన్ని రుణాలతో పాటు పీఎంఈజీపీ, ముద్రా రుణాలు, పీఎం సూర్యఘర్ పథకానికి రాయితీ రుణాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ పి.మహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, స్థానిక నాయకుడు పోతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ రాజశేఖరం

మండల పరిషత్ బడ్జెట్ ఆమోదం

కె.కోటపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశం మంగళవారం ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో సాంబశివరావు 2025-26 సవరణ బడ్జెట్ 2026- 27 అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టారు. సవరణ బడ్జెట్ రాబడి రూ. 64742 9000, వ్యయం రూ. 62,50, 15,000, ముగింపు నిల్వ రూ. 22,91,3500గా పేర్కొన్నారు. అలాగే, అంచనా బడ్జెట్ రాబడి రూ. 68,317,4500, వ్యయం రూ. 65,338,6950, ముగింపు నిల్వ రూ. 29,78,7550 చదివి వినిపించగా సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భుజంగరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.

వీరవిల్లి అగ్రహారంలో 'రైతన్నా.. మీకోసం'

మాడుగుల రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేజేపురం పశు వైద్యాధికారి శివకుమార్ రైతులకు సంక్షేమ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. సచివాలయం సిబ్బంది, ఏహెచ్ఏ కన్నంనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈఈ కర్రిశంకరరావు తెలిపారు. తారువ ఫీడర్ పరిధి బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధిలోని వాసులు సహకరించాలన్నారు.

పారదర్శకంగా ఉపాధి పథకం సోషల్ ఆడిట్

రావికమతం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీని పారదర్శకంగా నిర్వహించాలని ఎస్ఆర్‌పీ బి. దాసు కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ సమావేశంలో మంగళవారం సోషల్ ఆడిట్ సిబ్బంది, అధికారులు, వీఆర్‌పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 లో మండలంలో రూ.21.24 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వీటిలో రూ.16. 67 కోట్లు వేతనదారులకు, రూ.4. 5 కోట్లు వివిధ అభివృద్ధి పనుల మెటీరియల్‌కుకేటాయించినట్టు చెప్పారు. డిప్యూటీ ఎంపీడీవో సీతారామారావు,ఏపీవోలు చిన్నారావు, కాశీ పంచాయతీ రాజ్, ఫారెస్ట్, హౌసింగ్ అధికారులున్నారు.

'బ్రహ్మణులను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి'

బుచ్చెయ్యపేట నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో బ్రహ్మణులను కించపరుస్తూ పాటపాడిన పల్లెవోలు రమణ, సీడీ నరసయ్య, భారతీయ నాస్తిక సమాజంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అల్ ఇండియా బ్రహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు సుసర్ల హరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూట్యూబ్ ఛానల్ నుంచి ఆ పాటను తీసివేయాలని విజ్ఞప్తి చేశారు. బ్రహ్మణులపై వ్యంగంగా పాటలు రూపొందించడం దారుణమన్నారు.

మహిళలతోనే సమాజ ప్రగతి

దేవరాపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) మహిళలు ఆర్థిక ప్రగతి తోనే సమాజం అభివృద్ధి చెందుతుందనిఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. వెలుగు కార్యాలయం యాక్షన్ ప్లాన్ షెడ్యూల్ -2 పైసమావేశం మంగళవారం జరిగింది. జడ్పీటీసీ కర్రిసత్యం, ఏపీఎం ప్రభాకరు, తదితరులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడు గీతాకృష్ణపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు గీతాకృష్ణపై అనకాపల్లి జిల్లా మునగపాక మండలం నాగులాపల్లికి చెందిన దళిత నాయకుడు జామి శివఅప్పలరాజు మంగళవారం పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దళిత వర్గానికి చెందిన వైద్యులు, ఇంజనీర్లకు ఎటువంటి ప్రతిభ ఉండదంటూ గీతాకృష్ణ చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గీతాకృష్ణతో పాటు ఆయన ఇంటర్వ్యూను ప్రసారం చేసిన ఛానల్‌పై కూడా చర్యలు తీసుకోవాలని శివఅప్పలరాజు డిమాండ్ చేశారు.

డ్వాక్రా సంఘాల బడ్జెట్‌పై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ వెంకటరమణ

కె.కోటపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కె.కోటపాడు మండలం మహిళా సంఘాల బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలని ప్రాజెక్టు జిల్లా మేనేజర్ వెంకటరమణ అన్నారు. మండలంలోని 55 గ్రామ సంఘాల ప్రతినిధులకు వార్షిక బడ్జెట్ తయారీ పై అవగాహన కల్పించారు. ఏపీఎం చిన్నబాబు, సీసీలు వెంకట్రావు, రాంబాబు, సత్యనారాయణ, ఉమా మహేశ్వరి, రత్నం, సురేష్, మల్లేశ్వరి వర్క్‌షాపు నిర్వహించారు.